# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 16-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆవిష్కరిస్తారు.**

2. **తెలంగాణ శాసన సభ బడ్జెట్ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతాయి.**

3. **ప్రజల ప్రయాణాలు సులభరంతరం చేసేందుకు మరిన్ని అమృత్ భారత్ రైళ్లు అందుబాటులోకి తీసుకురానున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈరోజు నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.**

5. **ఆంధ్రప్రదేశ్ లో వంట గ్యాస్ కొరత లేదని, వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ పేర్కొన్నారు.**

=========================

ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆవిష్కరిస్తారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళిగా ఆయన 125వ జయంతి ఉత్సవాల్లో భాగంగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. అమరావతిలో 6.8 ఎకరాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేస్తున్నారు. "స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్" పేరుతో విగ్రహాన్ని ఏర్పాటు చేసారు.

-------------------------

అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.. భాషా ప్రయుక్త రాష్ట్ర సిద్ధాంతానికి కారకులై.. ఆంధ్ర రాష్ట్రం సాధించుకోవడంలో కీలక భూమిక పోషించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు... ఆయన 1901 మార్చి 16న అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని నెల్లూరు జిల్లాలో జన్మించారు. 1930లో గాంధీజీతో కలిసి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. 1941-42 సంవత్సరాల్లో సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని.. మూడుసార్లు జైలుకు వెళ్ళారు. 1952 అక్టోబర్ 10 నుంచి 58 రోజులపాటు ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి. డిసెంబర్ 15న ఆయన అసువులు బాసి అమరజీవి అయ్యారు.ఆయన ఆత్మార్పణం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు కారణమైంది.

-------------------------

తెలంగాణ శాసన సభ బడ్జెట్ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ ఉదయం ఉభయ సభల నుద్దేశించి ప్రసంగించిన అనంతరం సభ రేపటికి వాయిదా పడుతుంది. తర్వాత బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరుగుతుంది. రేపు, ఎల్లుండి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై చర్చ జరుగుతుంది. ఈనెల19న ఉగాది సెలవు అనంతరం 20వ తేదీన ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం ఉందని 23వ తేదీ నుంచి వివిధ శాఖల పద్దులపై చర్చిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రజల ప్రయాణాలు సులభరంతరం చేసేందుకు మరిన్ని అమృత్ భారత్ రైళ్లు అందుబాటులోకి తీసుకురానున్నామని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు రైల్వేస్టేషన్ లో అమృత్ భారత్ రైలును స్థానిక శాసనసభ్యులు రాధాకృష్ణతో కలిసి జెండా ఊపి నిన్న ప్రారంభించారు. అదే రైలులో తణుకు నుండి భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వరకు చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రాధాకృష్ణ మాట్లాడుతూ

వాయిస్..25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈరోజు నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజూ పరీక్ష ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు కొనసాగుతుంది. ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల 40 వేల 916 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందు కోసం 3 వేల 415 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును విద్యాశాఖ కల్పించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఈ అవకాశం ఉంటుందని తెలిపింది. పరీక్షల నిర్వహణకు కృష్ణా జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు తెలియజేస్తూ,

వాయిస్...30 సెకన్లు

---------------------------

పదవ తరగతి పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి ఆందోళన లేకుండా మానసిక ప్రశాంతతతో పరీక్షలు రాసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదవ తరగతి పరీక్షలకు 13,604 మంది బీసీ వసతి గృహాలు, ఎంజేపీ పాఠశాలల విద్యార్థులు హాజరవుతున్నారని మంత్రి తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, అధ్యయన సామగ్రి అందించామని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి సవిత వెల్లడించారు. ఈ ఏడాది కూడా బీసీ వసతి గృహాలు, ఎంజేపీ పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

---------------------------

తెలంగాణలో మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ హైదరాబాద్ లోని ఎల్బీ

స్టేడియంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రంజాన్ మాసం ఒక పండుగ మాత్రమే కాదని విలువలను గుర్తుచేసే పవిత్ర మాసం అని తెలిపారు. ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లోనూ మైనారిటీలను భాగస్వామ్యం చేస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ వసతి గృహాల్లో మైనారిటీలకు అవకాశం కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30 .. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో వంట గ్యాస్ కొరత లేదని, వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో వంటగ్యాస్ సరఫరా అంతరాయం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకున్నాయని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 15 వేల 699 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న గ్యాస్ కొరతపై వదంతులు నిరాధారమని ఖండించారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సౌరభ్ గౌర్ స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా శ్రీశైలం మహాక్షేత్రంలో ఈరోజు నుంచి ఉగాది మహోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వరకు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు స్వామి, అమ్మవార్లకు వాహనసేవలు నిర్వహించనున్నామని తెలిపారు. ఉత్సవాలకు అధిక సంఖ్యలో వస్తున్న భక్తులకు దర్శనం, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు శ్రీనివాసరావు వెల్లడించారు.

---------------------------

ఉపరితల ద్రోణి, నైరుతి గాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న మూడు రోజులు ఎండలతో పాటు మేఘావృత వాతావరణం కొనసాగనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో ఈరోజు పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

తెలంగాణలోనూ ద్రోణి ప్రభావంతో ఈరోజు, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================